




దువ్వూరు మండలం నీలాపురం సమీపంలోని ప్రభుత్వ భూమిలో తవ్వి కుప్పగా పోసిన ఎర్రగ్రావెల్

మట్టిదందా

వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన కుందూ నది విస్తరణ పనులు కూటమి ప్రభుత్వం రాకముందే నిలిచిపోయాయి. దీంతో కుందూ నది వెంబడి వరదప్రవాహం నుంచి గ్రామాల రక్షణ కోసం వేసిన మట్టికట్టలన్నీ నేడు మాయ మౌతున్నాయి. నాడు వైసీపీ నేతలు నదులను గుల్లచేస్తే.. నేడు నది వెంబడి ఉన్న మట్టి కట్టలను కూటమి నేతలు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.



కుందూనది కట్ట మట్టిని తరలించేందుకు ట్రాక్టర్‌లో నింపుతున్న దృశ్యం

- నిలిచిపోయిన కుందూ విస్తరణ పనులు
- నాడు నదిని కొల్లగొట్టిన వైసీపీ నేతలు
- నేడు కరకట్టల మట్టిని తరలిస్తున్న కూటమి నేతలు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కుందూ నది కర్నూలు, కడప జిల్లాల్లో విస్తరించి ఉంది. కర్నూలు జిల్లా బనకచర్ల నుంచి ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట దగ్గర పెన్నానదిలో కలిసే వరకు కుందూనదిలో విస్తరణ పనులు దాదాపు 186 కిలోమీటర్ల మేర రూ.1200 కోట్లతో వైసీపీ ప్రభుత్వం చేపట్టింది. కర్నూలు, కడప జిల్లాల్లో దాదాపు రూ.100 కోట్ల మేర పనులు జరిగాయి. కడప జిల్లాలో రాజుపాళెం, ప్రొద్దుటూరు, మైదుకూరు మండలాల్లో దాదాపు రూ.25 కోట్ల మేర విస్తరణ పనులు జరిపినట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ ఒక్క రూపాయి బిల్లు కూడా కాంట్రాక్టర్‌కు చెల్లించకపోవడంతో విస్తరణ పనులు నిలిచిపోయాయి. దీంతో కుందూనది నుంచి తవ్విన ఇసుక, మట్టిని వైసీపీ కాంట్రాక్టర్లే అక్రమంగా రవాణా చేసి కోట్ల రూపాయలు గడించారనే ఆరోపణలున్నాయి. కుందూ విస్తరణ పేరిట నదిలో ఇసుక, మట్టిని దాదాపు 3.24 లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు జరిపినట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడిన్నారు. ప్రభుత్వం మారాక నదిలోనిదే కాకుండా నదికి వరదల నుంచి రక్షణగా పోసిన మట్టి కట్టలను సైతం కూటమి నేతలు అక్రమంగా వెంచర్లకు తరలించి పైసలు దండుకుంటున్నారు.

తరలిపోతున్న కరకట్టల మట్టి

విస్తరణలో భాగంగా కుందూలో తవ్విన మట్టిని కట్టలుగా వేయడంతో గ్రామాలకు వరదల ప్రభావం తగ్గడంతో పాటు నీళ్ల నదిలో నిలువ ఉండి తమ పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయనుకున్న రైతుల ఆశలను మట్టి మాఫియా అడియాశలు చేస్తోంది. రాజుపాళెం మండలం గోపల్లె టంగుటూరు గ్రామాల పరిధిలోని కుందూనది వెంబడి పోసిన మట్టికట్టలను రెండు నెలలుగా రాత్రింబవళ్లు ఎక్స్‌వేటర్లు పెట్టి ట్రాక్టర్లకు లోడ్ చేస్తూ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో కుందూనది ఇరుపక్కల దశాబ్దాలుగా ఏటిపరంబోకు భూముల్లో సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలన్నీ నేడు రోడ్డున పడ్డాయి. యథేచ్ఛగా కట్టల మట్టి తరలిపోతుంటే ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మట్టికట్టల నుంచి మట్టి తరలిపోకుండా చూడాలని కుందూ పరీవాహక గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకం

- ట్రాక్టర్లతో తరలింపు

దువ్వూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. రాత్రివేళల్లో ట్రాక్టర్లను పెట్టి అవసరమైన ప్రాంతాలకు మట్టి తరలిస్తున్నారు. ఈ తతంగం దువ్వూరు మండలంలోని నీలాపురం పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ట్రిప్పు మట్టిని దూరాన్ని బట్టి రూ.1500, రూ.2 వేలతో అమ్ముతున్నారు. అక్రమంగా మట్టి తరలించే సమయంలో ఎవరైనా అడ్డుపడితే నేతల పేర్లు వాడుకుంటున్నారు. మరికొందరు ఎర్రగ్రావెల్‌ను ట్రాక్టర్లతో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎర్రగ్రావెల్‌ను ట్రిప్పు రూ.4 వేలతో అమ్ముతున్నారు. ఇందులో ఎర్రమట్టి కలిసి ఉండడంతో నర్సరీలకు ఉపయోగపడుతుంది. దీంతోపాటు ప్లాట్లు వేసిన ప్రాంతాల్లో రోడ్లు ఆకర్షణీయంగా కనపడేందుకు ఈ గ్రావెల్‌ను వాడుతున్నారు. ఈ తరహా గ్రావెల్ నీలాపురం సమీపంలోని సర్వే నంబరు 1335లో ఉంది. అక్రమార్కులు రాత్రివేళ ఎక్స్‌కవేటర్లను పెట్టి తవ్వకాలు చేసి కుప్పలుగా పోసి అవసరమైన చోట్లకు తరలిస్తున్నారు. అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ తవ్వకాలు అరికట్టకపోతే ప్రకృతి సంపద లూటీ అయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దువ్వూరు తహశీల్దారు అక్బల్ బాషా దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా ఆ గ్రామ రెవెన్యూ పరిధిలోని వీఆర్వోను పరిశీలించమని పురమాయిస్తామన్నారు. అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.



ట్రాక్టర్ల రాకపోకలతో ఏర్పడిన జాడలు



షేక్ సోనూ మృతదేహం

పోలీస్‌స్టేషన్ బాత్‌రూంలో యువకుడి ఆత్మహత్య

- గ్రిల్‌కు చొక్కాతో ఉరివేసుకున్న వైనం
- విచారణ చేపట్టిన ఆర్డీవో

కడప క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో బుధవారం రాత్రి టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఓ యువకుడు.. అర్ధరాత్రి దాటాక బాత్‌రూంలో ఉరివేసుకుని మృతిచెందాడు. దీనిపై ఆర్డీవో విచారణ చేపట్టి ఇది ఆత్మహత్యగా తేల్చారు. మృతుడి తల్లి సైతం తమ కుమారుడు కడుపునొప్పితో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. వివరాలు ఇలా.. కడప నకాష్‌కు చెందిన షేక్ సోనూ అలియాస్ పండా (23) జులాయిగా తిరుగుతుండేవాడు. ఇతనిపై గతంలో రెండు గంజాయి కేసులతో పాటు రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక చోరీ కేసు ఉన్నాయి. 2024లో నమోదైన గంజాయి కేసుకు సంబంధించి సోనూను పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని కడప టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఉంచుకున్నారు. గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని అనుకున్నారు. కాగా బుధవారం అర్ధరాత్రి దాటాక ఉన్నపళంగా కడుపు నొప్పి అంటూ తాను బాత్‌రూం వెళ్లాలని చెప్పడంతో పోలీసులు అతన్ని బాత్‌రూముకు పంపించారు. బాత్‌రూం లోపలికి వెళ్లిన అతను చాలాసేపైనా బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లగా సోను బాత్‌రూం కిటికీ గ్రిల్‌కు చొక్కాతో ఉరివేసుకున్నాడు. వెంటనే పోలీసులు అతడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. విషయం తెలుసుకున్న కడప టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్‌ఐలు హుసేన్, సిద్దయ్య అక్కడికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. షేక్ సోనూ ఆత్మహత్యకు పాల్పడడంపై జమ్మలమడుగు డీఎస్పీ ఆధ్వర్యంలో విచారించాలంటూ ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు.

ఆర్డీవోతో విచారణ

కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో కడప ఇన్‌చార్జి ఆర్డీవోగా ఉన్న బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తమ సిబ్బందితో కలిసి రిమ్స్ మార్చురీకి చేరుకున్నారు. మృతుడి తల్లి షేక్ చాను, బంధువులతో పాటు పోలీసులను విచారించారు. అలాగే రిమ్స్ వైద్యులు ఆయన సమక్షంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఆర్డీఓ తొలుత టూటౌన్ పోలీసు స్టేషను వెళ్లి కేసు వివరాలను, ఆత్మహత్యకు పాల్పడిన బాత్ రూంను పరిశీలించారు. షేక్ సోనూది ఆత్మహత్యగా ఆయన నిర్ధారించారు.

కడుపునొప్పితో ఆత్మహత్య చేసుకున్నాడు

తన కొడుకు సోనుకు గతంలో అపెండిక్స్ ఆపరేషన్ చేయించామని, అప్పుడప్పుడు తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుండేవాడని అతడి తల్లి షేక్ చాను తెలిపారు. రెండురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లాడని, అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నాక తమకు సమాచారం అందించారని, దీంతో పాటు ఆధార్ కార్డు తేవాలని చెప్పారని అన్నారు. తన కొడుకు కడుపునొప్పితోనే ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. తన కొడుకుకు గంజాయి అలవాటు ఉందని, సరిగా ఇంటి వద్ద ఉండకుండా ఎప్పుడూ స్నేహితులతో తిరుగుతుంటాడని ఆమె మీడియా ముందు చెప్పారు. అయితే ఈ సంఘటనపై కడప డీఎస్పీ, స్టేషన్ అధికారులు సైతం ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం.

- మృతుడి తల్లి షేక్ చాను

15 కిలోల బంగారు నగలు పట్టివేత



బంగారు ఆభరణాలున్న బాక్సులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నుంచి వాహనంలో తరలిస్తున్న 15 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్లో సీఐ రామకృష్ణారెడ్డి ఎస్‌ఐలు సంజీవరెడ్డి శ్రీనివాసులు ప్రొద్దుటూరు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో భారీగా బంగారు ఆభరణాలు కనిపించాయి. హైదరాబాదులోని అన్‌మోల్ స్వర్ణ్ అనే గోల్డ్ కంపెనీకి చెందిన ప్రతినిధులు ఈ బంగారు ఆభరణాలను తీసుకెళుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు రూ.14 కోట్ల విలువైన 15 కిలోల బంగారు ఆభరణాలకు సంబంధించి బిల్లులను పరిశీలించారు. బిల్లులు టాలీ కాకపోవడంతో ఆదాయపన్ను అధికారుల పరిశీలనకు బిల్లులను పంపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ బంగారు ఆభరణాలను ఒన్‌టౌన్ పోలీసు లాకప్‌లోనే భద్రపరిచారు.



పెండ్లి ఇంటి ద్వారబంధాన్ని పగలకొట్టిన దృశ్యం

ప్రొద్దుటూరులో భారీ చోరీ

- 32 తులాల బంగారం,2 కిలోల వెండి, రూ.5 లక్షల నగదు దోచుకెళ్లిన దొంగలు
- మరో మూడు ఇళ్లలో చోరీ యత్నం

ప్రొద్దుటూరు ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలోని ఓ ఇంటిలో భారీ చోరీ జరిగింది. పెండ్లి ఇంట్లో 32 తులాల బంగారు, 2కిలోల వెండి, రూ.5లక్షల నగదు దొంగలు దోచుకెళ్లారు. ఇదే ప్రాంతంలో మరో మూడు ఇళ్లలో సైతం చోరీకి యత్నించారు. ఇందులో ఓ ఎస్‌ఐ ఇల్లు కూడా ఉండటం విశేషం. పోలీసులు బాధితుల కథనం మేరకు..

ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరం వెంకటేశ్వరస్వామి దేవళం సమీపంలోని నరాల బాలిరెడ్డి కాలనీలో తాళాలు వేసిన నాలుగు ఇళ్లలో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఇందులో మూడు ఇళ్లలో చోరీకి ప్రయత్నించారు. కానీ విలువైన వస్తువులేవీ లేకపోవడంతో ఇళ్లల్లో సామానులు చెల్లాచెదురు చేసి వెళ్లారు. ఈ మూడు ఇళ్లలో పట్టణంలో పనిచేసే ఒక ఎస్‌ఐ ఇల్లు కూడా ఉంది. యనమల చంద్రశేఖర్ రెడ్డి అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇంట్లో మాత్రం 32 తులాల బంగారు నగలు, 2 కిలోల వెండి ఆభరణాలు, రూ.5 లక్షల నగదు చోరీకి గురయినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు చెన్నకేశవరెడ్డికి పట్టణంలో ఆదివారం వివాహం జరిగింది. బుధవారం ఉదయం ఇంటిల్లిపాది మలిపెళ్లికి కర్నూలుకు వెళ్లారు. దీంతో ఇంటికి తాళాలు వేసి ఉండటంతో ఈ దొంగతనం జరిగిందని పోలీసులు వెల్లడిస్తున్నారు. ఇంటి ప్రధాన డోర్‌ను గడ్డపారతో పెకలించి తలుపులు తెరిచి దర్జాగా ఇంట్లోకి వెళ్లి దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోందన్నారు. ఐదుగురు దొంగలు చోరీలకు పాల్పడినట్లు అప్రాంతంలోని సీసీ కెమరాల ద్వారా పోలీసులు నిర్ధారించారు. క్లూస్ టీం సైతం ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు. దొంగలను పట్టుకోవడం కోసం ప్రత్యేక టీంలను వేశామన్నారు.



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ గోవిందరెడ్డి

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



రామకృష్ణ మృతదేహం

ముద్దనూరు ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామంలో గురువారం అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు.. ఉప్పలూరు గ్రామంలో రామకృష్ణ (50), లక్ష్మీదేవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి పిల్లలు లేరు. వ్యవసాయ కూలిపనులతో జీవనం సాగించేవారు. కొన్నేళ్లుగా 4 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నారు. అందులో రామకృష్ణ అప్పులు చేసి వంకాయ, బెండ, మిరప సాగు చేశారు. పంటల దిగుబడి సరిగా రాకపోగా వచ్చిన దిగుబడులకూ ధరలు లేక నష్టపోయారు. దీంతో తీసుకున్న అప్పులు చెల్లించలేక పోవడంతో వడ్డీతో కలిపి రూ.5లక్షలు దాటింది. ఈ అప్పులు తీర్చేమార్గం కనిపించక పోవడంతో మనస్థాపం చెందిన రామకృష్ణ గురువారం ఊరిబయట పొలంలో వేపచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రామకృష్ణ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ముద్దనూరు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు.

కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి



కొప్పర్తిలో విలేకరులతో మాట్లాడుతున్న చైర్మన్ దినేశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల సంస్థ చైర్మన్ పొల్లంరెడ్డి దినేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, పర్యావరణ ఇంజనీరుతో కలిసి కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కును ఆయన పరిశీలించారు. పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో పెద్ద పెద్ద కంపెనీలతో కొప్పర్తిని అభివృద్ధి చేసేలా రూపకల్పన చేస్తామన్నారు.

నిరుద్యోగుల చేతికి చిప్ప : డీవైఎఫ్ఐ



చేతుల్లో ప్లేట్లతో కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘం ఆందోళన

కడప సెవెన్‌రోడ్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోత): ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ నిరుద్యోగుల చేతికి కూటమి ప్రభుత్వం చిప్ప ఇచ్చిందని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మండిపడ్డారు. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేసి భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ డీఎస్సీపై ముఖ్యమంత్రి మొదటి సంతకం చేసి పది నెలలు కావస్తున్నా నోటిఫికేషన్‌ను మాత్రం విడుదల చేయడంలో ఆలస్యం చేస్తున్నారన్నారు. రకరకాల పేరుతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్ తదితరులు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పెండింగ్ లేకుండా నిర్దేశిత లక్ష్యం మేరకు పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతిలోని ఏపీ సచివాలయం నుంచి ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టుకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హాజరయ్యారు. వీడియోకాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19వ తేదీ శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో భాగంగా జిల్లా అవసరాలకు తగినంత ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో సోలార్ ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీపీవో రాజ్యలక్ష్మి, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాష, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముందుగా పన్ను చెల్లిస్తే.. అయిదు శాతం రాయితీ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో నివసిస్తున్న ఇళ్ల యజమానులు తమ ఆస్తులకు సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ నెలాఖరులోగా ఒకేసారి పన్ను చెల్లిస్తే పన్ను మొత్తంలో అయిదు శాతం రాయితీగా అందిస్తారు. ఇందుకోసం ఆస్తి, ఖాళీజాగాల పన్నులను ఎటువంటి బకాయిల్లేకుండా రెండు అర్ధ సంవత్సరాలకు సంబంధించి ఏకమొత్తంగా చెల్లిస్తే ఈ ప్రయోజనం లభిస్తుంది. దీనివల్ల ఏటా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు, అక్టోబరు నుంచి మార్చి మధ్య రెండు దఫాలుగా చెల్లించాల్సిన ఇబ్బందీ తప్పుతుంది. సచివాలయ అడ్మిన్ల ద్వారా కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. జిల్లాలోని కడప కార్పొరేషన్‌తో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో మొత్తం 2,27,724 అసెస్‌మెంట్లకు గాను 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.101.03 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నారు. 5శాతం రాయితీ అంటే ముందస్తుగా పన్నులు కడితే ఇళ్లయజమానులకు రూ.5.05కోట్ల మేర మిగులుతుంది. ఈ మేరకు ఇళ్ల యజమానులు ముందుకొస్తే మొత్తం డిమాండ్‌లో కనీసం 20శాతానికి పైగా పన్నులు ముందస్తుగా వసూలు అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో అసెస్‌మెంట్లు, డిమాండ్ (రూ.కోట్లలో..)

మున్సిపాలిటీ	అసెస్‌మెంట్	డిమాండ్
కడప	1,02,330	55.84
ప్రొద్దుటూరు	34,496	22.88
పులివెందుల	23,249	6.93
బద్వేల్	25,116	6.45
జమ్మలమడుగు	11,935	2.97
ఎర్రగుంట్ల	11,505	2.78
మైదుకూరు	13,488	2.58
కమలాపురం	5,603	0.59
మొత్తం	2,27,724	101.03

అలసత్వం వహిస్తే వడ్డీమోత

పన్ను చెల్లింపుల్లో అలసత్వం వహిస్తే వడ్డీ భారాన్ని మోయాల్సి వస్తుంది. మొండి బకాయిదారులు ఎగవేత ధోరణి విడనాడి పాత బకాయిలతో పాటు ప్రస్తుతం నడుస్తోన్న సంవత్సరం పన్నును చెల్లించాలి. పన్నులు పూర్తిగా చెల్లించి కార్పొరేషన్ ఆర్థికాభివృద్ధికి తోడ్పడండి.

- భాస్కర్ గౌడ్, రెవెన్యూ అధికారి, కార్పొరేషన్, కడప

● మిరప, కాలిఫ్లవర్, బొప్పాయి, చీనీ అంట్లు, టమోట, ఉల్లిపాయల సాగు చేసిన రైతు

ఒకటిన్నర ఎకరం.. ఆరు పంటలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు ఒకటిన్నర ఎకరం పొలంలో ఆరు పంటలు సాగు చేశాడు. దున్నకాలు తప్ప అన్ని యాజమాన్య పద్ధతులను తానే స్వయంగా చూసుకుంటూ సాగు చేస్తున్నాడు. మండలంలోని బయనపల్లె గ్రామానికి చెందిన కూకట్ల సుబ్బరాయుడు అనే రైతు తనకు ఉన్న ఒకటిన్నర ఎకరం పొలంలో మిరప, కాలిఫ్లవర్, బొప్పాయి, చీనీ అంట్లు, టమోట, ఉల్లిపాయలు సాగు చేస్తున్నాడు. ఒకే పొలంలో అన్ని రకాల పంటలను సాగు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆరు పంటలు వేసినందు వల్ల ఒక దాంట్లో కాకున్నా మరొక పంటలో ఆదాయం






టమోటా, ఉల్లి సాగు

వస్తుందనే ఆలోచనతో ఆరు పంటలను వేశాడు. ఉల్లిపాయలు గట్టు మీద ఎనిమిది వరసలు వేశారు. 20 సెంట్లలో మిరప, 30 సెంట్లలో కాలిఫ్లవర్, 40 సెంట్లలో చీనీ నిమ్మ అంట్లు, 10 సెంట్లలో టమోట, మిగిలిన ఎకరా భూమిలో బొప్పాయి పంట సాగు చేస్తున్నాడు. 20 రోజుల్లో కాలిఫ్లవర్ కోతకు వస్తుంది. అదే విధంగా మిరప 15 రోజుల్లో కోతకు వస్తుంది. టమోటా ప్రస్తుతం కోత దశలో ఉంది. ఉల్లిపాయలు 20 రోజుల్లో కోత దశకు వస్తాయి. చీనీ నిమ్మ అంట్లు 50 రోజుల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే విధంగా వస్తాయి.

ఒకే పంట వేస్తే ఆదాయం రాదని ...



ఒకే పంటను వేస్తే ఆదాయం రాదని తెలుసుకుని ఆరు పంటలు వేశాను. బొప్పాయి పంటను ఒకటిన్నర ఎకరంలో వేస్తే తెగుళ్లు రావచ్చు, దిగుబడి రాకుండా ఉండవచ్చు, ధరలు లేకుండా ఉండ వచ్చు ఇలా ఏదైనా జరగవచ్చునని ఆలోచించి ఆరు రకాల పంటలను వేశాను. ఒకటి కాకున్నా మరొకటి లాభాన్ని చేకూర్చుతుంది.

- కూకట్ల సుబ్బరాయుడు, ఆరు పంటల రైతు, బయనపల్లె



సాగులో ఉన్న కాలిఫ్లవర్



మిరప



చీనీ అంట్లు



బొప్పాయి

వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వేగవంతంగా సోలార్ ప్రాజెక్టుల భూసేకరణ : కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 19వ తేదీ మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో భాగంగా జిల్లా అవసరాలకు తగినంత ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. పీఎం కుసుమ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టిన ఎంఎస్‌ఎంఈల సర్వేను పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. ఉద్యం డేటా, ఎంఎస్‌ఎంఈ డేటా తేడాలు ఉండరాదన్నారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పరీక్షలు, మార్కులే జీవితం కాదు

కస్తూర్బా విద్యార్థినుల అవగాహన కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరీక్షలు, మార్కులే జీవితం కాదని, బాలికలు అన్నింటిలో ఆత్మ విశ్వాసంతో ముందుకు నడవాలని డీఈవో డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిధిలోని మదనపల్లె డివిజన్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా జీసీడీవో మధుమతి అధ్యక్షతన పరీక్షలు, మార్కులే జీవితమా..? అనే అంశంపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పరీక్షలు మార్కులే జీవితం అనుకోకుండా ఇతర ఎన్నో రకాల రంగాల్లో విద్యార్థులు రాణిస్తూ ముందుకు నడవాలన్నారు. మానసిక వైద్య నిపుణులు రాధిక మాట్లాడుతూ ఇటీవల కాలంలో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఉత్తీర్ణత సాధించలేదన్న వివిధ కారణాలతో కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అది చాలా తప్పు అన్నారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్, పోలీసు అధికారి రాంమూర్తి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షా ఫలితాలే విద్యార్థుల అంతిమ లక్ష్యం కారాదని, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్ డాక్టర్ గౌతమి, ఫోర్డ్ సంస్థ సభ్యురాలు సుబాషిణి, సమగ్ర శిక్ష పూర్వ సెక్టోరల్ ఆఫీసర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ బాలికలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రూ.350 వేతనం వచ్చేలా పనిచేయాలి

● డ్వామా పీడీ వెంకటరత్నం

రామాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోజువారీ వేతనం రూ.350 వచ్చేలా ఉపాధి కూలీలు పనిచేయాలని పీడీ వెంకటరత్నం అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలో గురువారం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు నీటికుంట పనులు, పశువుల నీటితొట్టిలు, పశుగ్రాసం, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. 3 నెలలుగా డబ్బు రాలేదని కూలీలు పీడీ దృష్టికి తీసుకురాగా త్వరలో వస్తాయని తెలిపారు. రూ.350 రోజు వారి వేతనం వచ్చేలా కూలీలచే పనిచేయించాలని అధికారులకు సూచించారు. రైతులకు హార్టికల్చర్, పశువుల నీటి తొట్టి పనులు, ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో మంజూరైన ఫారంపాండ్స్, పశువుల నీటి తొట్టె పనులు ఈనెల చివరికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట లక్ష్మీనరసయ్య, ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రవిశంకర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి, అల్లా బకషలు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

కేక్ తిని ఐదుగురు చిన్నారులకు అస్వస్థత

రామసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండల కేంద్రంలోని ఓ బేకరీలోని హనీ కేక్ తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని అంజనేయస్వామి కాలనీకి చెందిన సుధీర్ (11), మధుశ్రీ (9), దర్శన్ (8), భవ్య (5), శ్రీధర్ (2) అస్వస్థత గురై వాంతులు చేసుకున్నారు. వీరికి కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పిల్లల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై బేకరీ యజమాని మాట్లాడుతూ హనీ కేక్‌ను ఉదయం ఎనిమిది గంటలకు తీసుకెళ్లారని, కానీ సాయంత్రం 6 గంటలకు పిల్లలు అస్వస్థతకు గురి కావడంతో ఏమీ జరిగిందో తెలియడం లేదని చెప్పారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా నిషేధిత మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు సంబంధిత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

ఉన్నతమైన లక్ష్యం నిర్దేశించుకోవాలి

● అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి


పీలేరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి); ఉజ్వల భవిత కోసం విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రదొడ్డి సుభాషిణి తెలిపారు. గురువారం పీలేరు బాలికల ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో 99 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన పి.నందినికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1993వ సంవత్సరంలో ఇదే పాఠశాలలో పదవ తరగతి చదవడం వల్లే తాను ఆరోజు ఈ స్థాయికి చేరానని తెలిపారు. తన తల్లిదండ్రులు చందన, కృష్ణారెడ్డిల జ్ఞాపకార్థం ఏటా తెలుగులో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఫౌజియా బేగం, ఉపాధ్యాయులు జానం సుజాత, గంగయ్య శ్రీకళ, ఉమామహేశ్వరి, రెడ్డిదీపారాణి, ఇంద్రాణి, ప్రసన్నలక్ష్మి, రాధారాణి, శైలజ విద్యార్థులు పాల్గొన్నారు.



నందినికి బంగారు పతకం అందజేస్తున్న సుభాషిణి

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం దగ్ధం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి గాయాలు కాగా ద్విచక్రవాహనానికి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన హరీష్‌కుమార్‌రెడ్డి గురువారం తన ద్విచక్ర వాహనంపై నిమ్మనపల్లికు వస్తుండగా ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలో మదనపల్లి మండలం కొత్తఇండ్లకు చెందిన గురువంశీ మదనపల్లికి వెళుతుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హరీష్‌కుమార్‌రెడ్డికి గాయాలు కాగా అతడిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరీష్‌కుమార్‌రెడ్డికి చెందిన ద్విచక్రవాహనం కింద పడడంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



కాలిపోతున్న ద్విచక్రవాహనం

భర్త, అత్తపై వరకట్నం వేధింపుల కేసు

రామసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వరకట్నం తీసుకురావాలని భర్త సునీల్‌ప్రతాప్, అత్త గంగులమ్మ తనను వేధిస్తున్నారని లావణ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని మాలేనత్తం పంచాయతీ ఎర్రపసెట్టిపల్లెకు చెందిన బూవిగాళ్ల నారాయణప్ప కుమార్తె లావణ్య (23)కు పెద్దపంజాణి మండలానికి చెందిన సునీల్‌ప్రతాప్‌తో వివాహమైంది. అయితే భర్త, అత్త తనను వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

31లోపు ఈకేవైసీ చేసుకోండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోపు రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలని మదనపల్లె సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, ఎండీయూలతో సమావేశం నిర్వహించారు. ఆయా రేషన్ డీలర్ల పరిధిలో ఉన్న కార్డుదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోడౌన్ డీటీ సుబ్రహ్మణ్యం, రేషన్ డీలర్ల అధ్యక్షుడు ఇమామ్‌ఖాసీమ్, డీలర్లు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు

● వ్యవసాయాధికారి చంద్రానాయక్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతు సంఘాలకు డ్రోన్లను అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. కిసాన్ డ్రోన్లపై జిల్లా స్థాయి వర్క్‌షాప్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కిసాన్ డ్రోన్ పథకం మార్గదర్శకాలను వివరించారు. ప్రభుత్వం రైతు సంఘాలకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రోన్‌లు ఉపయోగించడం వల్ల పురుగు మందుల పిచికారీ ఖర్చు తగ్గడంతో పాటు ఎకరం పిచికారీ 10 నిమిషాల్లో పూర్తవుతుందన్నారు. జిల్లాకు 34 డ్రోన్లు మంజూరయ్యాయని, రైతు సంఘాలు తమ గ్రూపు ఖాతాలో 50 శాతం జమ చేస్తే బ్యాంకులు 50 శాతం రుణం జారీ మంజూరు చేస్తాయని చెప్పారు. డ్రోన్ గ్రౌండింగ్ తర్వాత ప్రభుత్వం రైతు గ్రూప్ ఖాతాకు 80 శాతం సబ్సిడీని విడుదల చేస్తుందన్నారు. రైతు సంఘాలకు రుణాలు మంజూరు చేయడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధంగా ఉందని తెలిపారు. డ్రోగో డ్రోన్స్, విహంగా డ్రోన్ల కంపెనీల ప్రతినిధులు తమ డ్రోన్ల ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రూ.11 కోట్ల నష్టాల్లో పీలేరు ఆర్టీసీ

● నష్టాల సాకుతో 31 సర్వీసులు రద్దు ● హైదరాబాద్, విజయవాడ, చెన్నై సర్వీసులు ప్రతిపాదనలకే పరిమితం ● 87 సర్వీసులలో 73 ఆర్డినరీ బస్సులే

పీలేరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ డిపో రూ.11 కోట్ల నష్టాల్లో కూరుకుపోయింది. ఎంతోకాలంగా ఇక్కడి నుంచి హైదరాబాద్, చెన్నై, విజయవాడ, తిరుమల తదితర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను నష్టాల సాకుతో రద్దు చేయడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డిపోలో ఉన్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులను క్రమంగా రద్దు చేయడం, అదనంగా కొత్త సర్వీసులు రాకపోవడం, మెజార్టీ సర్వీసులు ఆర్డినరీ కావడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు కార్మికులు వాపోతున్నారు. 118 సర్వీసులతో ప్రయాణీకుల సేవలో తరించిన పీలేరు డిపోలో ప్రస్తుతం 87 సర్వీసులకే పరిమితమైంది. నష్టాల సాకుతో 31 సర్వీసులను రద్దు చేయడం గమనార్హం. రద్దయిన సర్వీసులలో హైదరాబాద్, తిరుమల, చెన్నై, విజయవాడ తదితర సర్వీసులున్నాయి. పీలేరు ఆర్టీసీ డిపో నుంచి రోజుకు 35,735 కిలోమీటర్ల మేరకు బస్సులను నడుపుతూ సుమారు 30 వేల మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డీఎంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, కార్యాలయ సిబ్బంది, గ్యారేజ్‌లో 431 మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు రూ.15 లక్షలు కలెక్షన్ రావాల్సి ఉండగా 11 నుంచి 12 లక్షల రూపాయలు మాత్రమే వస్తోంది. ప్రధానంగా డిపో పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసుల వల్లే భారీ నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. ప్రతి మార్గంలో అనధికారికంగా ఆటోలు, జీపులు, ఇతర వాహనాలలో ప్రయాణీకులను తరలిస్తుండడంతో నష్టాలు తప్పడం లేదు.



పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్


సమష్టి కృషితో నష్టాలు అధిగమిస్తాం



సమష్టి కృషితో నష్టాలు అధిగమిస్తాము. ప్రధాన కూడళ్లలో డ్రైవర్, కండక్టర్లు రెండు నిమిషాలు బస్సులను ఆపి ప్రయాణీకులను ఎక్కించుకునేలా చర్యలు చేపట్టాము. ప్రయాణీకులే సంస్థకు ప్రధాన ఆర్థిక వనరు కావడంతో డ్రైవర్, కండక్టర్లు వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలి. ప్రయాణికుల అవసరం మేరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతాము.

- బి.నిర్మల, డిపో మేనేజర్, పీలేరు.

కొత్త సర్వీసులు నడపాలి



పీలేరు డిపో మనుగడను దృష్టిలో పెట్టుకుని కొత్త సర్వీసులను సుదూర ప్రాంతాలకు నడపాలి. పీలేరు నుంచి హైదరాబాద్, చెన్నై, తిరుమల, విజయవాడ, కర్నూలు మార్గాలలో కొత్త సర్వీసులు నడపాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము.

పీఎల్ఎం రాజు, ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ



సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమాచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారానికి 9399976999, 8688888880లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్.ఎం.బాషా, రఘునారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

వేంపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఫాజిల్, ఆనంద్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. వారం రోజుల క్రితం బాలికను ఫాజిల్ అనే యువకుడు కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. ఇందుకు ఆనంద్ సహకరించాడని ఆరోపిస్తూ బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరిద్దరిపై పోక్సో కేసు నమోదైంది. గురువారం నిందితులను అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో కడప సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొండాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణానికి చెందిన మంజుల లక్ష్మీదేవి (43) అనే వివాహిత బుధవారం హాస్పిటల్‌కు వెళుతున్నానని భర్తకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అయితే ఆమె ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త గురప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈమెకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రేషన్ కార్డు ఈకేవైసీ...



● చూసుకోండిలా.... చేసుకోండిలా

● ఈనెల 30 వరకు గడువు


ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకోవాలి... లేకుంటే రేషన్ పంపిణీ నిలుపుదల చేస్తారు... ఇది రెండు నెలలుగా ఎక్కడ విన్నా వినపడుతున్న మాటలు. అయితే అసలు తాము ఈకేవైసీ చేయించుకోవాలో లేదో.. లేకపోతే ఎక్కడ చేయించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు రేషన్‌కార్డే కొలమానం. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అందులో వివరాలు నవీకరించాల్సి ఉంది. చిన్నపిల్లలను చేర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించాలి. అప్పుడే పథకాలకు ఎంత మంది అర్హులు వంటి విషయాలు తెలుస్తాయి. ఈకేసీవైసీ పెండింగ్ ఉన్న వారి జాబితా ఇప్పటికే ఆయా సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్ద ఉంది. వారి వాద్దకు వెళితే వివరాలు నమోదు చేస్తారు. ఇలాంటివారు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ స్టేటస్‌ను సొంతంగా చూసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. గత నెల 30 వరకు ఉన్న ఈ గడువును ఈనెల చివరి వరకు పెంచారు. ఆన్‌లైన్ ఈకేవైసీ స్టేటస్ సొంతంగా ఇలా తెలుసుకోవచ్చు.



ఈ-పాస్ యంత్రంలో..

రేషన్ డీలర్/ఎండీయూ వాహనంలో ఈ-పాస్ యంత్రం ఉంటుంది. దానిలో మీ రేషన్‌కార్డు వివరాలు నమోదు చేస్తే సభ్యుల వివరాలు వస్తాయి. ఎరుపు రంగు గడియలో పేర్లు ఉంటే ఈకేవైసీ పెండింగ్ ఉన్నట్లు. ఆకుపచ్చ రంగులో ఉంటే వారిది ఈకేసీవైసీ పూర్తయినట్లు. ఎరుపు రంగు గడియలో పేరు ఉన్న వారు ఆధార్ సంఖ్యను నమోదు చేసి వేలిముద్ర వేస్తే ఈకేవైసీ పూర్తవుతుంది.



ఆన్‌లైన్‌లోనూ ఇలా...

గూగుల్ వెబ్‌బ్రౌజ్‌లో ఈపీడీఎస్1 అని నమోదు చేసి ఎంటర్ నొక్కండి. డిపార్టుమెంట్ ఆఫ్ కన్జూమర్ ఎఫైర్స్ ఫుడ్ అండ్ సివిల్‌సప్లై ఏపీ అనే వెబ్‌సైట్ తెరచుకుంటుంది. దానిలో రేషన్ కార్డు విభాగంలో ఆరు రకాల ఆప్షన్లు 'న్యూ' అనే పేరుతో కనిపిస్తాయి. ఈపీడీఎస్ అప్లికేషన్ సెర్చ్, రైస్‌కార్డు సెర్చ్ రెండు ఆప్షన్లలో ఒకదానిని క్లిక్ చేసి రేషన్‌కార్డు నంబరు నమోదు చేస్తే అందులో ఉన్నవారి పేర్లు వస్తాయి. ఆయా పేర్లు ఎదురుగా ఎస్ అని ఉంటే ఈకేవైసీ అయినట్లు, అలా కాకుండా నో కానీ, ఇంకేమైనా ఉంటే మాత్రం ఈకేవైసీ చేయించుకోవాల్సిందే. డీలర్ లేదా రేషన్ బండి వద్ద ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేసి ఈకేవైసీని పూర్తి చేసుకోండి. దీనికి ఏప్రిల్ 30 వరకు మాత్రమే గడువు ఉంది. అయిదు సంవత్సరాలలోపు, 80 సంవత్సరాలు పైబడిన వారికి ఈకేసీవైసీ అవసరం లేదు. మిగిలిన వారంతా విధిగా చేయించుకోవాల్సిందే.

పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవు

● ట్రాన్స్‌కో సిబ్బందికి ఎస్ఈ రమణ హెచ్చరిక


సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పనితీరు బాగుండాలని.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం చెన్నూరు విద్యుత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మండలంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలను పరిశీలించారు. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉండటం గమనించి.. వెంటనే సరిచేయాలని ఆదేశించారు. వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే ప్రజలు ఇబ్బందులు పడతారని.. సిబ్బంది లైన్ల వెంట తిరుగుతూ ఏవైనా లోపాలుంటే గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రామలింగారెడ్డి, సబ్ ఇంజనీరు స్రవంతి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి ఆర్టీఈ 2009 ప్రకారం ఉచిత ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో రెండు ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో కూడా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఐదేళ్లు వయసు నిండిన వారికే 1వ తరగతిలో మాత్రమే ప్రస్తుతం అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి 31.03.2025 నాటికి, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 01.06.2025 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. ఆర్ఫాన్, హెచ్ఐవి, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి ఐదు శాతం, ఎస్సీలకు పదిశాతం, ఎస్టీలకు నాలుగుశాతం, వీకర్ సెక్షన్స్, ఇతరులకు ఆరు శాతం సీట్లు లభిస్తాయన్నారు. ఎంపిక రాష్ట్రస్థాయిలో ఉంటుందన్నారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 15 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మే 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల వద్ద ఉన్న డేటా తో పోల్చుకొని అడ్మిషన్లు ఇస్తారని తెలిపారు.

వైవీయూకు రూ.10కోట్లతో ఎన్ఆర్ఎఫ్‌పీఏఐఆర్ ప్రాజెక్టు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయానికి మెగా రీసెర్చ్ ప్రాజెక్టు మంజూరైంది. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎన్ఆర్ఎఫ్ పీఏఐఆర్) పథకం కింద యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో కలిసి రూ.10కోట్లు నిధులు మంజూరయ్యాయి. అత్యున్నత స్థాయి పరిశోధన సంస్థలతో జత చేయడం ద్వారా మెంటార్‌షిప్ మోడల్‌లో పరిశోధకులు బాగా పనిచేయగల సామర్థ్యాన్ని పెంచడానికి ఈ పథకం రూపొందించారు. ఈ ప్రాజెక్టు కోసం యోగివేమన విశ్వవిద్యాలయంలో రోగనిర్ధారణ, మెటబాలిక్, ఇన్ఫెక్షన్స్, అంటువ్యాధుల చికిత్సలు, వ్యాధి నిమా యంత్రాంగంపై దృష్టి సారించే మొత్తం 22 ప్రతిపాదనలను వివిధ విభాగాలలో కలిసి 27 మంది అధ్యాపకులు సమర్పించారు. ప్రాజెక్టు నిధులతో పరిశోధనలు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశోధననిధులతో నాణ్యమైన పరిశోధనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీసీతో పాటు మాజీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ఎస్ఈగా డి.వెంకట్రామయ్య



కడప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీరుగా డి.వెంకట్రామయ్యను మరోసారి ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుగంగ ఎస్ఈగా పనిచేసిన విజయగోపాల్ పదోన్నతిపై విజయవాడ వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్‌గా మునీర్‌బాషా పనిచేశారు. అయితే ప్రభుత్వం రెగ్యులర్ ఇరిగేషన్‌లో ఈఈగా పనిచేస్తున్న వెంకట్రామయ్యకు ఎస్ఈగా బాధ్యతలు అప్పజెప్పింది. గతంలో కూడా వెంకట్రామయ్య తెలుగు గంగ ఎస్ఈగా పనిచేసి ఉన్నారు.

స్వచ్ఛభారత్‌కు అందరూ సహకరించాలి


కొండపేటలో పర్యటిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టరు స్వప్న

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌కు ప్రజలు సహకరించాలని.. తద్వారా గ్రామీణ ప్రాంతాలు ఆరోగ్యంతో విలసిల్లి ఆదాయం దిశగా అడుగులు వేస్తాయని స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర పరిశీలన డైరక్టరు దేవిరెడ్డి స్వప్న అన్నారు. మండలంలోని కొండపేట, చెన్నూరులలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రెండు పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యూపీసీలో ఉన్న వర్మీకంపోస్టును పరిశీలించి హరిత రాయబారులతో మాట్లాడారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌కు సహకరించి.. తడి పొడి చెత్తలను వేర్వేరుగా గ్రీన్‌అంబాసిడర్లకు అందించాలన్నారు. ఈ చెత్త ఎస్‌డబ్ల్యూపీసీకి చేరితే వర్మీకంపోస్టుగా మారి రైతులకు ఆదాయ వనరుగా మారుతుందన్నారు. అలాగే గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్ర వాతావరణం, శుభ్రమైన వీధులు, మంచి లైటింగ్ వ్యవస్థ ఉండాలన్నా అది ప్రజలతో సాధ్యమన్నారు. స్వచ్ఛ సంకల్పానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని సూచించారు. డీపీఓ రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, సర్పంచ్‌లు తుంగ చంద్రయాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

బీసీలను ఓటు బ్యాంకుగా చూసే పద్ధతికి స్వస్తి పలకండి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు


మాట్లాడుతున్న కేశన శంకరరావు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీలను ఓటు బ్యాంకుగా చూసే పద్ధతికి అన్ని రాజకీయ పార్టీలు స్వస్తి పలకాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అణగారిన వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన కులాల వారీగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడం దురదృష్టకరమన్నారు. పలు రాజ్యాంగ సవరణల మేరకు ఎస్సీ, ఎస్టీలకు విద్య, విద్యా, ఉద్యోగ రంగాలతో పాటు చట్టసభలు, స్థానక సంస్థలలో, ఇతర ఆర్థిక రంగాలలో జనాభా దామాషా ప్రకా రం రిజర్వేన్‌లు అమలవుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో కాకా కాలేక్కర్, బీపీ మండల్ కమిషన్లు, రాష్ట్ర స్థాయిలో మురళీధరరావు, జస్టిస్ రోహిణీ కమిషన్‌లు దేశ, రాష్ట్ర జనాభాలో సుమారు 52 శాతానికి పైగా బీసీలున్నారని తెలియపరచిన సంగతి తెలిసిందే అన్నారు. భవిష్యత్తులో చట్ట సభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నా, ఓబీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ మహి ళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలన్నా, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచడంతో పాటు సంక్షేమ పథకాలు సక్రమంగా ఆయా అణగారిన కులాల దామాషా ప్రకారం అమలు చేయాలన్నా దేశ ప్రజలందరి జనగణనతో పాటు కుల గణన చేయాల్సి వుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్య క్షుడు క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు కల్యాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాల ఏర్పాటు ఆత్మసంతృప్తినిచ్చింది : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో పశువైద్య కళాశాల ఏర్పాటు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల 12వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మూగజీవాలకు సేవ చేయడం అదృష్టమని.. ఈ కోర్సు ఎంచుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు కెనాడ, ఆస్ట్రేలియాల్లో పనిచేస్తున్నారని, హైదరాబాదుకు వెళ్లినప్పుడు ఇక్కడ చదివిన విద్యార్థులు తనను గుర్తుపట్టి పలుకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ వీసీ జేవీ రమణ మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు పొందారని, అలాగే ఇక్కడి విద్యార్థులు క్రీడలు, జాతీయస్థాయి సెమినార్లలో ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారన్నారు.

కలెక్టరు చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 64 శాతం వ్యవసాయ రంగం నుంచి లభిస్తుండగా 20 శాతం పశు సంపదనుంచి లభిస్తోందన్నారు. పశువైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ కల్యాణి, పశువైద్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు యువకుడు మృతి


శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

చక్రాయపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండి దేవస్థానం సమీపంలో గురువారం సాయంత్రం బైకును కారు ఢీకొట్టడంతో సుబ్బిరెడ్డి గారి శ్రీకాంత్‌రెడ్డి (30) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళితే... శ్రీకాంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం బైకులో వేంపల్లెకు వెళ్లి మొబైల్ కొనుగోలు చేశాడు. అక్కడ నుంచి చక్రాయపేటకు తిరిగి వస్తుండగా రాయచోటి వైపు నుంచి స్పీడుగా వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో శ్రీకాంత్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో వేంపల్లె ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీకాంత్‌రెడ్డికి వివాహమై ఒక కుమారుడు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు..

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిరెడ్డిపల్లె వద్ద బుధవారం అర్ధరాత్రి మోటర్‌సైకిల్ అదుపుతప్పి కల్వర్టను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గిద్దలూరుకు చెందిన సిద్దయ్య, ఆయన సోదరుడు జమ్మయ్య చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ప్రొద్దుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి డబ్బులు తీసుకొని గిద్దలూరుకు వెళుతుండగా ఆదిరెడ్డిపల్లె వద్ద బైకు అదుపుతప్పి రోడ్డు మరమ్మత్తుల్లో ఉన్న కల్వర్ట్‌ను ఢీకొంది. దీంతో సిద్దయ్య(23) అక్కడిక్కడే మృతి చెందగా, జమ్మయ్య గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న భారీ లారీని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం జమ్మలమడుగు బైపాస్ రోడ్డు నుంచి మైదుకూరు రోడ్డు వైపు వెళుతుండగా లోడుతో వున్న లారీని పోలీసులు తనిఖీ చేయగా.. అందులో రేషన్ బియ్యం వున్నట్లు నిర్ధారించుకున్నారు.

జమ్మలమడుగుకు చెందిన కామేశు అనే బియ్యం వ్యాపారి రేషన్ బియ్యాన్ని అక్రమంగా జమ్మలమడుగు నుంచి మైదుకూరు మీదుగా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషనుకు తరలించారు. ఈమేరకు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునకు రూరల్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆయన వెళ్లి లారీలోని బియ్యంను పరిశీలించి ..రేషన్ బియ్యంగా ధ్రువీకరించారు. కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగల మాయంపై ఏసీబీ కేసు

● 15 మంది అటవీ శాఖ అధికారులపై విచారణకు ఆదేశాలు

కలికిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట అటవీ రేంజ్ పరిధిలోని గోడౌన్ నుంచి ఎర్రచందనం దుంగలు మాయమైన సంఘటనకు సంబంధించి నాలుగేళ్ల క్రితం ఏసీబీ నమోదు చేసిన కేసులో 15 మంది అటవీ శాఖ అధికారులపై విచారణకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 జనవరి 29న వనిపెంట రేంజర్ కార్యాలయం, చెక్‌పోస్టు, గోడౌన్‌లపై ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మొత్తం 1037 కిలోల బరువున్న 37 ఎర్రచందనం దుంగలు మాయమైనట్లు ఏసీబీ గుర్తించింది. దీనిపై అప్పట్లోనే ఏసీబీ కేసు నమోదు చేసింది. వనిపెంట రేంజర్ సహా 15 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా నిర్ధారిస్తూ తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించింది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ ప్రారంభమయ్యేలోగా సంజాయిషీలు చెప్పుకునే అవకాశం కల్పిస్తూ విడివిడిగా నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి బాధ్యులుగా గుర్తించిన వారిలో వనిపెంట అటవీ రేంజరు సీహెచ్ దినేష్‌కుమార్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైల్డ్‌లైఫ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎం.నాగార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంటు జి.విజ్ఞాథ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు జి.హరినాథ రాజు, సీహెచ్ బాలలింగారెడ్డి, జి.ఆనందం (రిటైర్డు), ఎస్.సుధాకర్ (రిటైర్డు), వై.రజనీకుమార్, పి.కృష్ణ, పి.రమణయ్య, జివి రమణ, సి.ప్రసాదరావు (రిటైర్డు), ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎస్.బాబు (రిటైర్డు), పి.ఓబులసుబ్బన్న (రిటైర్డు), పి.ఎస్.ఎన్.రాజు (రిటైర్డు) ఉమ్మడిగా విచారణను ఎదుర్కోవాల్సి వుంది. ఇందులో రిటైర్డు ఉద్యోగులపై పెన్షన్ రూల్స్ మేరకు విచారణ జరుగనుంది. రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఈ మేరకు మొత్తం 22 జీవోలను గురువారం విడివిడిగా జారీ చేశారు.

దొంగల కోసం పోలీసుల వేట

● పోలీసుల అదుపులో ఒకరు.. ఇద్దరు పరార్


దెబ్బతిన్న దొంగల కారు, పరిశీలిస్తున్న పోలీసులు

చాపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో దొంగల కోసం పోలీసులు వేటాడారు. ఒక దొంగ పట్టుబడగా.. మరో ఇద్దరు చాకచక్యంగా తప్పించుకొని పారిపోయారు. వివరాలిలా... ప్రొద్దుటూరు నుంచి ముగ్గురు దొంగలు కారులో వెళుతున్నట్లు సమాచారం రావడంతో రూరల్ పోలీసు స్టేషన్‌కు చెందిన ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, వెంకటసురేష్ సిబ్బందితో కలసి గురువారం మధ్యాహ్నం వారిని వెంబడించారు. చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం నుంచి రాజుపాళెం వైపు వెళుతుండగా ముందుగానే ఎస్ఐ అరుణ్‌రెడ్డి వారి రాకను తెలుసుకుని కారుకు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా తన కారును నిలిపారు. అయితే దొంగలు తప్పించుకునేందుకు ఆ కారును ఢీకొట్టడంతో దొంగల కారుముందు భాగం దెబ్బతింది. పోలీసులు అడ్డుకోవడంతో కారులో ఉన్న ముగ్గురు దొంగలలో ఒక మహిళా దొంగ, మరొకరు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి తప్పించుకుని పారిపోయారు. ఒకరిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో దొంగలు వారి కారులోని ఒక బ్యాగును పక్కనే ఉన్న కాలువలో పడవేయగా స్వాధీనం చేసుకున్నారు. కాగా, దొంగల కారులో నకిలీ కారు నెంబర్ల ప్లేట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

'హైకోర్టు ఉత్తర్వుల మేరకు భూవివాదం పరిష్కరించాలి'

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు భూ వివాదం పరిష్కరించాలిని ఓ మాజీ సైనిక ఉద్యోగి కుటుం బ సభ్యులు డిమాండ్ చేశారు. మాజీ సైనికుడైన జింకా చెంద్రాయుడుకు ప్రభుత్వం కేటాయించిన రామేశ్వరం పొలంలోని 5.02 ఎకరాల భూమిని తమ కుమార్తెల పేరుతో మ్యూటేషన్ చేయాలని కోరుతూ జింకా విజయలక్ష్మి తన కుమార్తెలతో కలిసి గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివంగత మాజీ సైనికుని కుమార్తెలు చంద్రావతి, భవానిలు మాట్లాడుతూ మా భూమి మా పెద్దనాన్న కుమారుడు జింకా బ్రహ్మయ్య ఆధీనంలో ఉందన్నారు. ఆ భూమిలోకి ఇరువురిని దిగవద్దని 164 సెక్షన్ పెట్టారన్నారు. కానీ ఆ భూమిలో పంటను దొంగలు ఎవరో కోసుకుపోయారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. తహసీల్దారు గంగయ్య, డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డిలు వారితో మాట్లాడారు. 164 సెక్షన్ ఉల్లంఘించి ఎవరు పంట కోసుకుపోయారో చర్యలు తీసుకోమని రూరల్ పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. హైకోర్టు జడ్జిమెంట్‌లో కూడా ఈ భూవివాదంపై విచారించి మాజీ సైనికునికి ఒక అవకావశం ఇవ్వమని చెప్పిందన్నారు. కావున మీకు భూమి ఆన్‌లైన్ చేసే విషయం మా చేతిలో లేదన్నారు. మేము ఇరుపార్టీలకు నోటీసులు ఇచ్చి వారి దగ్గర వున్న ఆధారాలు పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను పంపామన్నారు. జేసీ, కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని.. వారి ఆదేశాలనుసారం న్యాయం చేస్తామన్నారు. సాయంత్రం వరకు బైఠాయించిన వారు తహసీల్దారు గంగయ్య ఇచ్చిన హామీతో నిరసన విరమించారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

● నేషనల్ హైవేకు రూ.4.80 కోట్లతో మరమ్మతులు

పులివెందుల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల-ముద్దనూరు నేషనల్ హైవేకు ఎన్నాళ్లకెన్నేళ్లకు మరమ్మతులు అనే స్థాయిలో సాగుతున్నాయి. గత నాలుగైదేళ్లుగా చెప్పుకొనే స్థాయిలో ఈ మరమ్మతులు సాగలేదు. అడుగడుగునా చిన్నచిన్న ప్యాచ్‌లతో రోడ్డంతా గీసుకుపోయిన అధ్వాన రోడ్డుకు విముక్తి లభించింది. పూర్తి స్థాయిలో రోడ్డు వేయకపోయినా కొంతమేర రోడ్డు బాగుంది అనిపించే స్థాయిలో మరమ్మత్తులకు నోచుకుంది. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే...



యంత్రాల సాయంతో రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

పులివెందుల-ముద్దనూరు రహదారి నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. 36 కి.మీ. మేర ఉన్న ఈ రోడ్డు జిల్లాలోనే అత్యంత దారుణమైన రోడ్డుగా ఉందని ప్రజల నుంచి విమర్శలు వినిపించాయి. ఇంత దారుణంగా ఉండడానికి కారణం వైసీపీ ప్రభుత్వంలో ఈ రెండులేన్ల రహదారి నాలుగులేన్ల రహదారిగా మారుస్తూ అదికూడా నేషనల్ హైవేగా మారింది. దీంతో నాలుగులేన్ల రహదారి నిర్మాణం జరిగే వరకు అటు ఆర్‌అండ్‌బీ గాని ఇటు నేషనల్ హైవే వారు గాని పట్టించుకోలేదు. దీంతో అడుగడుగునా గుంతల హైవేగా పేరుపొందింది. ఏడాదికో ఏడాదిన్నరకో చిన్న చిన్న మరమ్మతులు చేసినప్పటికీ రోడ్డు చూడ్డానికి గాని, వాహనాలు నడిపేందుకు అధ్వానంగా మారింది. ఈ సందర్భంలో రూ.4.80 కోట్లతో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అడుగడుగునా చిన్నచిన్న ప్యాచ్‌లతో వాహనదారులు ఇబ్బందిపడే విధంగా తయారైంది. కానీ ఇప్పుడు ఈ రహదారికి చెప్పుకొనే స్థాయిలో మరమ్మతులు జరిగాయి. ముద్దనూరు నుంచి పులివెందుల వరకు గతంలో పలు దఫాలుగా మరమ్మతులు చేసినప్పటికీ ముద్దనూరు నుంచి తొండూరు వరకు ఒకసారి, తొండూరు నుంచి పులివెందులకు మరొకసారి ఇలా విడతల వారీగా మరమ్మతులు సాగాయి. కానీ ఈసారి ముద్దనూరు నుంచి పులివెందుల వరకు ఈ రహదారికి చెప్పుకొనే స్థాయిలో మరమ్మతులు సాగడం గమనార్హం. చిన్నచిన్న ప్యాచ్‌లతో కాకుండా ఒక చోట నుంచి దాదాపు 50, 100 అడుగులు, 150 అడుగులు దూరం ఇలా రోడ్డు స్థితిని బట్టి మరమ్మతులు సాగించారు. ఈ మరమ్మతులు పులివెందుల-ముద్దనూరుకు 36 కి.మీ. మేర ఉండగా 32 కి.మీ. దూరం సాగాయి. పులివెందుల నుంచి రాయలాపురం కొత్త బ్రిడ్జి వరకు అప్పటి సీఎం జగన్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా రోడ్డును పూర్తిగా నూతనంగా ఏర్పాటు చేశారు. రాయలాపురం వరకు ప్యాచ్‌లు లేని రోడ్డుగా ఉంది. ముద్దనూరు నుంచి పుట్టపర్తి జిల్లా తలుపుల మండలం బి.కొత్తపల్లె వరకు నాలుగులేన్ల రోడ్డుగా మారింది. ఇప్పటికే పలుమార్లు టెండర్ దశవరకు వచ్చి ఆగిపోయింది. ప్రస్తుతం టెండర్ పూర్తి చేసుకొని త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి. ఏదేమైనా నేషనల్ హైవేకి మంచి రోజులు వచ్చాయని చెప్పవచ్చు.

అరటి రైతులను ఆదుకోండి : ఎంపీ

లింగాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా ఇచ్చి అరటి రైతులను ఆదుకోవాలని కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల వీచిన పెనుగాలులకు లింగాలలో నేలకొరిగిన అరటి తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సోమవారం 750 ఎకరాల్లో, మూడు వారాల క్రితం 1420ఎకరాల్లో పెనుగాలులకు అరటిచెట్లు నేలమట్టం కావడంతో రైతులు రూ.42కోట్ల పెట్టుబడిని కోల్పోయారన్నారు. ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తుంటే ప్రభుత్వం ఎకరాకు రూ.14వేలు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామంటోందని.. ఈ సొమ్ము అరటి పంటను తొలగించేందుకు కూడా సరిపోదన్నారు. రైతులకు న్యాయం జరగాలంటే ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు పనిచేయడం లేదని మార్చి 25న ఉద్యానాధికారులు కలెక్టర్‌కు లేఖలు రాశారన్నారు. కాబట్టి ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ల ఆధారంగా కాకుండా జరిగిన నష్టం ఆధారంగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సూరెన్స్ కూడా ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట పులివెందుల వైసీపీ రైతు విభాగం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా జనరల్ సెక్రటరీగా గౌస్‌పీర్

కడపనాగరాజుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా సయ్యద్ గౌస్‌పీర్ నియామకమయ్యారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు కడపలోని కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి ఆధ్వర్యంలో ఆయనకు నియామకపత్రం అందించారు. గౌస్‌పీర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

కిసాన్ డ్రోన్లపై అవగాహన ఉండాలి : జేసీ

కడపకలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కిసాన్ డ్రోన్లపై అవగాహన కలిగి ఉంటే ఫలితాలు సులభంగా పొందవచ్చని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రోన్లపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ బ్యాంకు రుణాల ద్వారా సబ్సిడీపై ఇస్తున్న డ్రోన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం డ్రోన్ల వినియోగం, మార్గదర్శకాలను వివరించారు. ప్రాంగణంలో డ్రోన్లను ఎగురవేసి, వాటి పనితీరును జేసీకి వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు జనార్దనం, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, యూనియన్ బ్యాంకు మేనేజరు రెడ్డెయ్య, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సరస్వతి పాల్గొన్నారు.

20న మారెమ్మ తల్లి జాతర

కడప కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నగర 49వ డివిజన్ ఆలంఖాన్ పల్లెలో వెలసిన మారెమ్మతల్లి ఆలయ 21వ వార్షికోత్సవం సందర్భాన్ని పురష్కరించుకుని ఈ నెల 19, 20 తేదీలలో వైభవంగా జాతర మహోత్సవం జరుగనుంది. అందులో భాగంగా 19న శనివారం ఆలయంలో అమ్మవారికి గణపతిపూజ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరగనుంది. అనంతరం సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా వుంటుంది. తదుపరి 20వ తేది ఆదివారం ఉదయం అమ్మవారికి నిండు కుండ బోనాలు, మొక్కుబడులు, అనంతరం బండలాగుడు పోటీలు, కోలాటం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ నిర్వాహకులు వెల్లడించారు. భక్తులు అమ్మవారి సేవలో తరించి ఆశీస్సులు పొందాలని కోరారు.

కడప మున్సిపల్ డీఈఈ వేణుగోపాల్‌కు పదోన్నతి

● వివాదాలు కొలిక్కి రావడంతో పదోన్నతికి సానుకూలం

కలికిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పలు రకాల వివాదాల నేపథ్యంలో ఎట్టకేలకు కడప మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.వేణుగోపాల్ (పబ్లిక్ హెల్త్)కు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో నిబంధనలను అతిక్రమించి టెండర్లు లేకుండా పనులు చేపట్టి అక్రమాలకు పాల్పడ్డారన్న అభియోగంతో ఆ విభాగం డీఈఈ వేణుగోపాల్‌పై 2022 అక్టోబరు 20న విచారణకు ఆదేశించారు. అనంతరం 2023 ఆగస్టులో ఇంజినీరింగ్ విభాగంలో డీఈఈల పదోన్నతుల ప్రక్రియను చేపట్టి ఈఈల పదోన్నతుల జాబితాను ఇంజినీర్ ఇన్ చీఫ్ (పబ్లిక్ హెల్త్) తయారు చేసి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ముందుంచారు. అయితే అదే ప్రమోషన్‌కు అర్హత వున్నా అక్రమాలకు సంధించిన విచారణను ఎదుర్కొంటున్న వేణగోపాల్ పేరును జాబితాలో చేర్చినా, విచారణ పూర్తయిన తరువాత మాత్రమే పదోన్నతి కల్పించేలా నిబంధన పెట్టారు. దీంతో ఆయన పదోన్నతి ఆగిపోయింది. ఈ దశలో వేణుగోపాల్ హైకోర్టును ఆశ్రయించగా పదోన్నతి కల్పించే విషయంలో ఆయన పేరును పరిశీలించాల్సిందిగా హైకోర్టు సూచించింది. అనంతరం అదే జాబితాను తిరిగి సవరించినా అందులో వేణుగోపాల్‌కు అవకాశం కల్పించకపోవడంతో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం తన పేరును పరిశీలించాలని, అంతేగాకుండా తనపై వున్న ఒకే ఒక అభియోగం కూడా విచారణలో తేలిపోయిందని విన్నవించడంతో ఆయన పేరును కూడా పరిశీలనలోకి తీసుకున్నారు. విచారణలో అభియోగం నిరూపణ కాకపోవడంతో వేణుగోపాల్ పదోన్నతికి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. దీంతో ఎట్టకేలకు ఆయనకు ఈఈగా పదోన్నతి కల్పిస్తూ మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 15 రోజుల్లోగా ఈఈగా బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు.

'రాబోవు కాలం కాంగ్రెస్ పార్టీదే'

వేంపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాబోవుకాలం కాంగ్రెస్ పార్టీదేనని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు బాబురావు, చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు ఫలనీరెడ్డి, రాజ్‌కుమార్ గురువారం వేంపల్లెలో తులసిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అరచేతిలో వైకుంఠం చూపిస్తే, చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని ఎద్దేవాచేశారు. ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి నిప్పులపొయ్యిలో పడ్డట్టు తయారైందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని, ఏమాత్రం నిరుత్సాహపడకుండా ప్రజా సమస్యలపై పోరాడాలని తులసిరెడ్డి వారికి సూచించారు.

సర్జరీపై అవగాహన ఉండాలి

● ఎల్వీపీఈఐ నేత్ర వైద్య నిపుణురాలు



వైద్య నిపుణులు డాక్టర్ శశిబిందు


కడప సెవెన్‌రోడ్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై కంటి సమస్యతో బాధపడే వారికి అవగాహన ఉండాలని ఎల్వీపీఈఐ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ శశిబిందు తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఎల్వీప్రసాద నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్యాంపస్‌లో లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శస్త్రచికిత్సను సాధారణంగా మయోపియా, హైపర్ మెట్రోపియా, ఆస్టిగ్మాటిజంలను సరిచేయడానికి చేయబడుతుందన్నారు. రోగి వయసు కనీసం 21 సంవత్సరాలు నిండి ఉండాలని, కనీసం సంవత్సరం పాటు స్థిరమైన దృష్టిని కలిగి ఉండాలన్నారు. లేజర్ రిఫ్రాక్టివ్ సర్జరీఅనేది అందరికి ఒకే విధంగా పనికొచ్చే పరిష్కారం కాదని, అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు.

అప్పులు జాస్తి.. అభివృద్ధి నాస్తి

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 11 నెలల పాలనలో అప్పులు జాస్తి.. సంక్షేమం, అభివృద్ధి నాస్తి అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. విద్యుత్‌చార్జీలతో పాటు గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు చుక్కలు తాకుతున్నాయన్నారు. తక్షణం పెంచిన ధరలు తగ్గించకుంటే వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. గురువారం కడప వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ చార్జీల పేరుతో చంద్రబాబు పేదల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో చార్జీలు పెంచమని ప్రగల్భాలు పలికిన విషయాన్ని గుర్తుచేశారు. ట్రూఅప్ చార్జీల పేరుతో డబుల్ చార్జీలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ స్టేట్ హజ్ కమిటీ మెంబరుగా మహబూబ్‌బాషా



పులివెందులటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ హజ్ కమిటీ సభ్యుడిగా రాష్ట్ర ప్రభుత్వం షేక్ మహబూబ్‌బాషాను నియమించింది. ఈయన గతంలో టీడీపీ మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం సమస్యలను కమిటీ దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. హజ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబుకు, టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీటెక్ రవికి ధన్యవాదాలు తెలిపారు.

పార్టీకి పూర్వ వైభవం తేవాలి: విజయజ్యోతి



నియామక పత్రాలు అందజేస్తున్న విజయజ్యోతి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. గురువారం పార్టీకి సేవలందించిన పలువురికి జిల్లా కార్యాలయంలో విజయజ్యోతి నియమాక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కడప జిల్లా కంచుకోట అన్నారు. పార్టీ పదవులు పొందిన ప్రతిఒక్కరూ పార్టీని పూర్వ స్థితికి తేవడంతో పాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా వేంపల్లికి చెందిన సుబ్రమణ్యం, సిరాజుద్దీన్(కడప), ప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులుగా గౌస్‌పీర్(కడప), సులోచనమ్మ (ఎర్రగుంట్ల) తదితరకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అలీఖాన్, ధ్రువకుమార్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, సయ్యిద్ ఖాజా మైనుద్దీన్, శ్యామలమ్మ, గౌరీదేవి, సంజయకాంత తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన ఉండాలి

● కడప ఫైర్ స్టేషన్ అధికారి బస్విరెడ్డి

కడప క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని కడప ఫైర్‌స్టేషన్ అధికారి బస్విరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం నగరంలోని చెమ్మమియాపేట జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ జిల్లా కోఆర్డినేటరు సుధాకర్ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్విరెడ్డి మాట్లాడుతూ ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు భయంతో పరిగెత్తకూడదని, వాటిని ఆర్పివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారి సురేశ్‌కుమార్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు గిరిజాకుమారి, ఉపాధ్యాయురాలు ఇందిరాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం రూరల్: అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి జనార్ధనరెడ్డి అన్నారు. గురువారం అగ్నిమాపక వారోత్సవాలు నాల్గవ రోజులో భాగంగా కమలాపురం అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని సూర్య హైస్కూలులో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ టీవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు



వాహనాలను ఆపుతున్న ఎస్పీ

కడప క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. కడప నగరంతో పాటు పలు పోలీసుస్టేషన్ల పరిధిలోని కూడళ్లలో పోలీసులు తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ఊటుకూరు సర్కిల్‌లో స్వయంగా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. అనంతరం అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు జారీ చేశారు.

ఎస్ఐగా రవికుమార్ బాధ్యతలు

సింహాద్రిపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం ఎస్ఐగా జె.రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన బద్వేలు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తులసీనాగప్రసాద్ కడప రూరల్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి



పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫకృద్దీన్

కడప రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని జడ్జి విజిట్ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం, మౌలిక సదుపాయాలను, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విలువలతో కూడిన విద్యను క్రమశిక్షణతో అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024, లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 తదితర వాటిపై అవగాహన కల్పించారు.

20న కార్యవర్గ సమావేశం

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దళితుల భూ సమస్యలపై ఈ నెల 20న రాష్ట్ర రాజధానిలో కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు దళిత భూసాధన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెద్దలపల్లి ఓబుళపతి తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో సమితి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూ సమస్యలపై విజయవాడలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు. ప్రతి జిల్లాలో దళితుల భూ సమస్యలు పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎన్ రాజా, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్టం సుబ్బారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పచారం బాలు, చిన్నగాళ్ల వెంకటసుబ్బయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప(వినాయకనగర్), ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పరిషత్ ఆవరణంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు శ్రీసాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి వృద్ధులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శంకరాపురానికి చెందిన సురేంద్రనాథ్ (సూరి) జన్మదినం సందర్భంగా నిరాశ్రయుల నడుమ ఇలాంటి కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, తిరుమలశెట్టి రఘురాం, శివశంకర్, రాజేశ్, కృష్ణారెడ్డి, బాషా పాల్గొన్నారు.

ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలి

● ఎన్ఎంయూ కడప డిపో కార్యదర్శి శ్రీనివాసులు



ప్లకార్డు ప్రదర్శనలో ఎన్ఎంయూ నాయకులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో గత నాలుగు సంవత్సరాలుగా నిలుపుదల చేసిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆర్టీసీలో గత కొన్నేళ్లుగా పేరుకుపోయిన అపరిష్కృత సమస్యలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని డిపోలలో ఈ నెల 2, 3 తేదీలలో ఎర్రబ్యాడ్జీలతో, తదుపరి 10, 11, తేదీలలో గేట్ మీటింగ్ కార్యక్రమాలు, చేపట్టినప్పటికీ స్పందన లేకపోవడంతో ఆ మేరకు ఎన్ఎంయూ కడప డిపో ఆధ్వర్యంలో ఈ నెల 17న గురువారం ప్లకార్డుల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ కడప డిపో నాయకులు టీఎం బాషా, నాగరాజు, రామచంద్ర, సి.సి.సుబ్బమ్మ, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు




బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థి

కడపస్పోర్ట్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పీఎం కేంద్రీయ విద్యాలయం కడప ఆధ్వర్యంలో నగర మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జిలానీబాష పర్యవేక్షణలో ఈనెల 16, 17, తేదీలలో రెండురోజుల పాటు హైదరాబాద్ రీజినల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. పోటీలకు హైదరాబాద్ రీజియన్ పరిధిలో గల 29 కేంద్రీయ విద్యాలయాల నుంచి అండర్-14, 17, 19, విభాగాల తాలూకు బాల, బాలికలు 116 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మునీష్‌మీనా మాట్లాడుతూ చదువుతో పాటుగా క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించేలా క్రీడా స్ఫూర్తిని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన పోటీలతో విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

21న శాంతియుత ర్యాలీ

పులివెందులటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల స్థానిక జామియతుల్ అన్సర్ ముస్లిం, మైనార్టీ సేవ కమిటీ వారి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న సోమవారం శాంతియుత భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు గౌస్‌పీర్ (పండు) తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకుడు నూరుల్లా, మతపెద్దలు కలిసి జరగబోవు ర్యాలీ విషయాలను చర్చించారు. సోమవారం ఉదయం 9గంటల నుంచి మక్కామసీదు వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఎమ్మార్వో ఆఫీసు వరకు భారీ ర్యాలీ చేసి తమ నిరసనను ఎమ్మార్వోకు తెలపాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మతాలకు, పార్టీలకతీకతంగా ప్రతి సంస్థ మేధావులు, కులపెద్దలు పాల్గొనాలన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐలు

వేంపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి సీఐ నరసింహులు, ఎస్ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్‌లు గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఏదైనా గొడవలకు పాల్పడితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీవాణి



సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ శ్రీవాణి

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా సీనియర్ సివి ల్‌సర్జన్ డాక్టర్ శ్రీవాణిని నియమించారు. ఆమేరకు గురువారం ఆమె ఆసు పత్రిలో గతసూపరింటెండెంట్ ఆనంద్‌బాబు నుంచి బాధ్యతలను స్వీకరించా రు. డాక్టర్ శ్రీవాణి ఇదే ఆసుపత్రిలో గైనకాజిస్టుగా సేవలు అందిస్తున్నారు. సీనియారిటీ ప్రకారం ఆమెను సూపరింటెండెంట్‌గా నియమిస్తూ హెల్త్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆమేరకు ఆసుపత్రివైద్యులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు అరికట్టాలి

ఖాజీపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను అరికట్టాలని ఎంపీటీసీ దుగ్గిరెడ్డి చంద్రభాస్కర్‌రెడ్డి కోరారు. గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సిద్దిక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీపీ దృష్టికి పంచాయతీలోని సమస్యలను వివరించారు. వేసవిలో ఎక్కడ నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సమావేశానికి సర్పంచుల బదులు వారి భర్తలు హాజరవుతున్నారని, ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులే హాజరుకావాలని అభ్యంతరం తెలుపడంతో ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకటరమణ ఎవరైనా హాజరుకావచ్చని తెలుపడంతో కొద్దిసేపు రసాబాసగా సాగింది. సమావేశం చివరకు భర్తలు హాజరుకాకూడదని ఎంపీడీవో చెప్పడంతో వారు సద్దుమణిగారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిలో కష్టానికి తగ్గ కూలి ఇవ్వాలి

అట్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అట్లూరు మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల్లో కష్టానికి తగ్గ కూలి ఇవ్వాలని కార్మిక సంఘం నాయకుడు రమణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ.275 వేయకుండా రూ.70 నుంచి 80 వరకు రోజు కూలీ వేయడంపై ఎంత వరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. వేసవిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 11 వరకు హాజరు పట్టికలో ఉండాలని నిబంధనలతో ఉపాధి కూలీలను మభ్యపెడుతున్నారని చాకిరీ చేయించి కొలతల్లో టెక్నికల్ అసిస్టెంట్లు మాయాజాలం చూపుతున్నారని ఉపాధి సిబ్బందిపై మండిపడ్డారు. ఈ నెల 21న కలెక్టరేట్ ఎదుట జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపాధి కూలీలకు తెలిపారు. అనంతరం ధర్నాపై కరపత్రాలను విడుదల చేశారు. కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంకాలమ్మ తిరునాళ్లు



అంకాలమ్మతల్లి

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో అంకాలమ్మతల్లి తిరుణాల మహోత్సవ వేడుకలను శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నామని తిరుణాల నిర్వాహకులు తెలిపారు. స్థానిక వనిపెంట రోడ్డులోని అంకాలమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు మాట్లాడు తూ శుక్రవారం బియ్యం కొలత,19 న శుద్ధభూతి, 20నబోనాలు, సుడిబండి ఉత్సవం, 21న వృషభ రాజముల చేత రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు జరు గుతాయని తెలిపారు. బండలాగు పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి 1,50,116, రెండవ బహుమతి ఒక్క లక్ష రూపాయలు, మూడవ బహుమతి రూ.75 వేలు, నాల్గవ బహుమతి రూ.50 వేలు, ఐదవ బహుమతి రూ.30 వేలు క్యాష్ ప్రైజ్ ఉంటుందని తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కాశినాయనఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):వాహన చోదకులు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పక పాటించాలని కాశినాయన మండల ఎస్ఐ హనుమంతు పేర్కొన్నారు. గురువారం ఓబుళాపురం మూడు రోడ్లకూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈసందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్న 7 మంది వాహనదారుల నుంచి రూ.5,745 జరిమానా వసూలు చేశామన్నారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ ఖాదరయ్య, కానిస్టేబుల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి దరఖాస్తుల ఆహ్వానం

గోపవరం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి పనుల కోసం 2024-25 సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ ల వారు వివిధ దరఖాస్తులు చేసుకోవాలని గోపవరం ఎంపీడీవో రామనాధరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల వారు మే 10లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఓబీఎంఎంఎస్.ఏపీ.గొ.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆయా బ్యాంకు మేనేజర్ల ద్వారా ఇంటర్వ్యూలునిర్వహిస్తారన్నారు. ఏవైనా వివరాలు తెలుసుకోవాలంటే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

బద్వేలుటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపాలెంలో 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ రాజగోపాల్ తెలిపారు. విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

బద్వేలుటౌన్, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): బద్వేలు అర్బన్ ఎస్ఐ 2గా కె.జయరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఎస్ఐల బదిలీల్లో అనంతపురం జిల్లాలో ఏఎస్ఐగా పనిచేస్తూ, పదోన్నతిపై బద్వేలు అర్బన్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలనుపాటిస్తూ ప్రజలతో ఫ్రెండ్లీపోలీస్‌గా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలి

బద్వేలు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని గురువారం తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తిప్పనపల్లె కమ్యూనిటీ హెల్త్ ఆఫీసరు ప్రభావతి, సుశ్మితలు మాట్లాడుతూ గిరిజన గ్రామీణ మారుమూల ప్రాంతాల ఆరోగ్య ఉప కేంద్రాల్లో 2019 నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నామని ఆరుసంవత్సరాలు సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో శిరీషా, రాధ, జ్యోత్స్న, వీణా, హర్షిత, గంగా భవానీ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల్లో పరిశుభ్రత

పోరుమామిళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సంపద తయారీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా ఉపాధి పనులు చేపట్టారు పోరుమామిళ్ల పంచాయతీ అధికారులు. గురువారం పోరుమామల్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు.

వక్ఫ్‌చట్టానికి నిరసనగా ర్యాలీ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్‌సవరణ చట్టానికి నిరసనగా శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు జేఏసీ నాయకుడు షేక్ సలీం పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం పర్సనల్ లాబోర్డు నిర్ణయం మేరకు జేఏసీ ఆధ్వర్యంలో 19న ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

వైసీపీ ఎంపీటీసీల హైడ్రామా..?

- మండల సమావేశాన్ని బహిష్కరించిన వైసీపీ ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు
- తొమ్మిది వరుస మండల సమావేశాలకు హాజరుకాని వైసీపీ ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి
- వైసీపీ ప్రభుత్వం నుంచే గౌరవవేతనం పెండింగ్‌లో ఉందంటూ ఆరోపణ
- ఎంపీపీ ఛాంబర్‌లో నిరసన
- మీటింగ్‌కు హాజరుకావాలని ఎంపీటీసీలను బతిమాలుకున్న ఎంపీడీవో కార్యాలయ ఏవో
- గౌరవవేతం చెల్లించినట్లు అధికారుల వెల్లడి
- హాజరైన ఇద్దరు బీజేపీ ఎంపీటీసీ సభ్యులు



ఎంపీటీసీలను బ్రతిమాలుతున్న ఎంపీడీవో కార్యాలయ ఏవో అరుంధతి

ముద్దనూరు ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):ఎంపీడీవో సభాభవనంలో గురువారం ఉదయం 10-30గంటలకు జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం వైసీపీ ఎంపీటీసీలు బహిష్కరించడంతో వాయిదా పడింది. కేవలం ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి ఎంపీటీసీ సభ్యత్వం రద్దు అవుతుందన్న కారణంగా వైసీపీ ఎంపీటీసీలు మూకుమ్మడిగా కొన్ని కుంటి సాకులతో హైడ్రామాకు తెర లేపి సమావేశానికి బహిష్కరించి వాయిదా పడేటట్లు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఉదయం 10-30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు,ఒక కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.వారిలో ముగ్గురు కూటమి సభ్యులు కాగా మిగిలిన వారు వైసీపీకి చెందిన వారే. దీంతో ఎంపీపీగా శెట్టివారిపల్లె ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈయన వరుసగా తొమ్మిది మండల సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే సర్వసభ్యసమావేశాలకు గైర్హాజరవుతున్న ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పెనికెలపాడు ఎంపీటీసీ ఏసుదాసు, కోఆప్షన్ మెంబర్ ఖదీర్ పై జడ్పీ సీఈవో దృష్టికి తీసుకెళ్లగా సీఈవో ఆదేశాల మేరకు నోటీసులు కూడా ఇచ్చినట్లు అధికారులు చెప్పుకొస్తున్నారు.దీంతో సర్వసభ్య సమావేశం జరిగితే ఏవిధమైన వివరణ ఇవ్వాల్సి వస్తుందో , ఎక్కడ సభ్యత్వం తొలగిస్తారోనని వైసీపీ ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ముద్దనూరు 1, 2 కొర్రపాడు, ఉప్పలూరు, నల్లబల్లె, పెనికెలపాడు, కోఆప్షన్ సభ్యులు ఎంపీడీవో కార్యాలయం చేరుకొని ఎంపీపీ ఛాంబర్‌లో కూర్చొని సర్వసభ్య సమావేశంను బహిష్కరిస్తున్నట్లు నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఒకటిన్నర సంవత్సరం మాత్రమే గౌరవవేతనం అందించారన్నారు. 11 గంటలు దాటినా ఎంపీటీసీ సభ్యులు సమావేశ భవనంలోకి రాకపోవడంతో సమావేనికి ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఏవో అరుంధతి వైసీపీ ఎంపీటీసీలు ఉన్న ఎంపీపీ చాంబర్‌లోకి వెళ్లి సమావేశం సజావుగా జరిగేందుకు సహకరించాలని బతిమాలారు. ఒక మహిళా అధికారి బతిమాలుతున్నా మహిళా ఎంపీటీసీలు స్పందించకపోవడంతో సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంకు వచ్చిన ముగ్గురు కూటమి సభ్యుల హాజరుతీసుకున్నారు.

గౌరవవేతనం ప్రతిఏటా అందిస్తున్నారు

ప్రతి ఏటా ఎంపీటీసీలకు గౌరవేతనం అందుతోందని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా 2023-24 సంవత్సరంకు సంబంధించిన గౌరవవేతనం ఎంపీటీసీ ల బ్యాంకు ఖాతాల్లో జమఅయిందని ఎంపీడీవో కార్యాలయ ఏవో, సమావేశ ఇన్‌చార్జి అరుంధతి తెలిపారు. 2024-25 కు సంబంధించిన గౌరవేతనం బిల్లు పెట్టడం జరిగిందని గౌరవేతనం అందించలేదన్న దానిలో ఎంపీటీసీలు చేసిన ఆరోపణల్లో వాస్తవంలేదన్నారు. సమావేశం వాయిదా విషయమై జడ్పీ సీఈవో దృష్టికి తీసుకెళతాం.

సమావేశానికి గైర్హాజరవుతున్న ఎంపీటీసీలపై ఫిర్యాదు చేశాం

వరుస మండల సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవుతున్న శెట్టివారిపల్లె ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, పెనికెలపాడు ఎంపీటీసీ ఏసుదాసు, కోఆప్షన్ మెంబర్ ఖదీర్ పై జడ్పీ సీఈవోకు ఫిర్యాదు చేశాం.సీఈవో ఆదేశాల మేరకు ముగ్గురికి నోటీసులు పంపడం జరిగింది. పెనికెలపాగు ఎంపీటీసీ మాత్రమే ఆరోగ్య సమస్యకారణంగా రాలేకపోతున్నానని వివరణ ఇచ్చారు.

-ముకుందారెడ్డి, ఎంపీడీవో, ముద్దనూరు

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

- సీబీఐటీ కాలేజీ కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి

చాపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని సీబీఐటీ కాలేజీ కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి విద్యార్థి పోటీ పరీక్షల్లో నెగ్గి మంచి ఉద్యోగం సంపాదించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, శృతిలు మాట్లాడారు.

వెల్లాల దేవస్థానానికి వేలం ద్వారా రూ.6.80లక్షలు ఆదాయం

రాజుపాలెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయ భీమలింగేశ్వర దేవస్థానానికి భూముల కౌలు వేలం పాట ద్వారా రూ.6.80 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.వెంకటరమణ తెలిపారు. ఇందులో భూముల కౌలు వేలం ద్వారా రూ.5,59,600, పులగం బియ్యం వేలంలో రూ.24,500 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. గురువా రం వెల్లాల దేవస్థాన సభాప్రాంగణంలో ఈ వేలం పాటను డివిజను ఇన్‌స్పెక్టరు, దేవదా యశాఖ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. మొత్తం 6.10 సెంట్లకు రూ.5,59,600, మూడు సంవత్సరాలు కౌలుకు వచ్చినట్లు తెలిపారు. మిగతా 11.25 సెంట్లు గతంలో జరిగిన అవకతవకలకు గాను విచారణ చేసి సవాల్ జరపాలని పలువురు రైతులు కోరడంతో దాన్ని నిలిపివేసినట్లు తెలిపారు.

12వ పీఆర్సీ నియమించాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని నియమించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పోరుమామిళ్ల ఎస్టీయు భవన్‌లో వీవీ క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశంలో ఆయ న మాట్లాడుతూ 11వపీఆర్సీ గడువు ముగిసి రెండు నెలలు కావస్తున్నాప్పటికీ కమిషన్‌ను నియమించకపోవడం సరికాదన్నారు. 12వ పీఆర్సీ నియమించి ఆరునెలల్లోపు రిపోర్టు తెప్పించుకోవాలని కోరారు.

గ్రామాల్లో పౌరసేవల తీరుపై పరిశీలన



స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు అందుతున్న పౌర సేవలు, మౌలిక సదుపాయాల తీరుపై అధికారులు పరిశీలన నిర్వహించారు. గురువారం జడ్పీ సీఈవో, డీపీవో ఆదేశాల మేరకు నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని కానపల్లె గ్రామంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామమోహన్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. స్థానికులను అడిగి పౌర సేవల తీరుతెన్నులపై తెలుసుకున్నారు. నిత్యం ఇంటింటి నుంచి చెత్త సేకరణ, మురుగు కాలువల్లో పూడికల తీసివేత, మంచినీటి సరఫరా, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. గ్రామంలో అక్కడక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించే చర్యలను చేపట్టారు. స్థానిక సుందరయ్య కాలనీలో సర్పంచ్ శివచంద్రారెడ్డి పర్యటించి అక్కడ అధ్వాన్నంగా ఉన్న మురుగు వ్యవస్థ, కాలువల నిర్మాణం, రోడ్ల నిర్మాణం తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపుతామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణలో సమాన రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాల, మాదిగలకు సమాన రిజర్వేషన్లు కల్పించాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎన్జీవో హోంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఎస్సీలను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించిందన్నారు. ఇందులో మాలలకు 7 శాతం, మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాల లక్షుమయ్యమాదిగ, డప్పు, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలనరసింహులు, బాలయ్య, విజయకుమార్, సుబ్బలక్షుమ్మ, రమాదేవి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ద్వారా సామాజిక న్యాయం

కలసపాడు/పోరుమామిళ్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ తేవడం ద్వారా సామాజిక న్యాయంవైపు ముందడుగువేసిందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యుడు శోభన్‌కుమార్ పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను మాదిగ ఉద్యోగుల సమాఖ్య తరపున స్వాగతిస్తున్నామన్నారు. ఈ ఆర్డినెన్స్ ద్వారా వెనుకబడిన మాదిగ, మాదిగ ఉపకులాలాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్‌కు చట్టభద్రత లభించినందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసు కువచ్చిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు సమాఖ్య జాతీయ కమిటీ పక్షాన చట్టబద్ధ గౌరవం లభించిందని హర్షంతో స్వాగ తిస్తున్నామని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గసభ్యుడు శోభన్‌కుమార్ పేర్కొన్నారు.

కబ్జా స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకోవాలి

జమ్మలమడుగు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో, గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని సీపీఐ కార్యదర్శి ప్రసాద్, రాంప్రసాద్, నాగేంద్ర తదితరులు డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి ఆ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం మానడంలేదన్నారు. బాధితులు అధికారులకు సమస్య తెలిపి న్యాయం చేయాలని అడిగినా రాజకీయ నేతల ఒత్తిడి వలన అధికారులు ముందుకు వెళ్లడంలేదని తెలిపారు. చర్మకారుల సొసైటీ స్థలం, ఆలయాలకు సంబంధించిన స్థలాలు కబ్జా అవుతున్నాయన్నారు. గూడెం చెరువు, రాజీవ్‌నగర్ కాలనీ, పొన్నతోట ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నర్సీజీ కొట్టాల, మైలవరం జలాశయం వద్ద స్థలాలు కబ్జాకు గురయ్యాయన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

జమ్మలమడుగు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జమ్మలమడుగులో నేషనల్ మజ్దూర్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. గురువారం నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మూడవ దఫా ప్లకార్డులు చేతపట్టుకుని ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమం డిపో కార్యదర్శి శివుడు ఆధ్వర్యంలో జరిగింది. అక్రమ సస్పెన్షన్లు తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ చైర్మన్ శేషన్న, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే చదివించాలి

బద్వేలు , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధి సాధించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధన విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రభుత్వ బడిలోనే విద్యార్థులను చేర్పిద్దాం అనే నినాదంతో మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె, గుంతపల్లె , సురేంద్రనగర్ ప్రాంతాలలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కరపత్రాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్, బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మస్తాన్ వలి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ సంస్కృతీ, నాటక రంగం చైర్మన్‌గా డాక్టర్ ప్రభాకర్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృతీ, నాటక రంగం చైర్మన్‌గా ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ ఎం.ప్రభాకర్‌ను నియమిస్తూ భారతీయ మానవ హక్కుల కమిషన్, భారతీయ మానవ అధికారపరిషత్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పదవి సంవత్సర కాలం ఉంటుందని రాష్ట్రస్థాయిలో భారతీయ సంస్కృతి, నాటక రంగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. భారత మానవ హక్కుల కమిషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం.పవన్‌కల్యాణ్, జాతీయ డైరెక్టర్ డాక్టర్ అలోక్‌కుమార్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన ప్రస్తుతం కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు అమరావతిలో ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్నారు.